(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

# బుచ్చిబాబుగారికి ప్రముఖులు వ్రాసిన ఉత్తరాలు

బుచ్చిబాబూ,

చివరకు ఈ స్థితిలో పడ్డాను.

నిన్న ఉదయం ఆఫీసుకు బయలుదేరబోతుంటే, మళ్ళీ చాలా ఎక్కువగా నొప్పి వచ్చింది భయపడి టాక్సీ తెప్పించుకుని, డాక్టరు షెవాయి ఇంటికే వెళ్ళాను. ఏవో మందులూ అవీ పడ్డాక ఇంటికి వచ్చాను. నొప్పి తగ్గింది. ఇవాళ ఉదయం డాక్టరు వచ్చి మరేమీ కంగారు లేదని చెప్పి, ఇంజెక్షన్ ఇచ్చి, వీలుంటే సాయంకాలం ఎక్స్‌రే తీయించి చూద్దామన్నాడు.

రేపు, తానే, ఆఫీసులో దిగబెడతానన్నాడు. కనుక, ఈ సాయంకాలం దాకా, ఇన్ని రోజులూ సెలవు ఎలాగ పెట్టాలి? మొన్న పోయిన శనివారం వచ్చానాఫీసుకు. ధోరణి చూస్తే, రేపటి నుంచి రాగలను. మా మావగారు ఇవాళ వచ్చి ఉంటారు, కనుక ఆయనతో మాట్లాడి ఆఫీసుకు పంపుదామనుకున్నాను. ఆయన ఇక్కడకు రాలేదు. నా యెడ దయవుంచి, మీరు శ్రీ నాయరుగారి తోను మన ధర్మజ్ఞానితోనూ సెలవు విషయం మాట్లాడండి – అంటే రేపటిదాకా.

ఏవయినా చూడవలసిన స్క్రిప్ట్స్ ఉంటే, కాగితాలుగాని ఉంటే, ఇంటికి పంపలేరూ? మీరొకసారి రాలేరూ? ఎల్లుడి ఆదివారం మందాకిని ఉంది. దానిలో రెండు ఐటమ్స్ ఉన్నాయి. (1) శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారి శ్లోకాలు – చిక్రోడం అంటే ఉడత మీద. ఈ శ్లోకాలు శ్రీ కె.వి.ఎన్ శాస్త్రిగారి బల్ల సొరుగులో ఉన్నాయి. తాళం శ్రీ వెంకోబాచారి వద్ద ఉన్నాయట. (2) ఇక రెండో ఐటం శ్రీ గుండేరావు హర్కారేగారి రచన సంస్కృతం సులభంగా నేర్చుకునే పద్ధతిమీద – ఇదివరకు స్క్రిప్ట్‌కే వ్రాసాం. ఇప్పుడు వారే వచ్చి చదివేటట్టు కాగితం పంపాలి.

మిమ్మల్ని – ఇతర మిత్రులనూ – ఈ విధంగా చిక్కులు పెడుతున్నందుకు సిగ్గుపడుతున్నాను. నన్ను మన్నించమని శ్రీనాయరుగారితోనూ చెప్పండి. ఏం చెయ్యను? అనుకోకుండా దుర్భరమైన బాధ వచ్చింది. అన్నట్టు నిన్న మిల్టన్ దేకి ఏదయినా జరిగిందా? ఈనెల 21 వ తేది శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి స్మరణ దినం – వారి ప్రతాపరుద్రీయం నుండి అయినా, విజయ బొబ్బిలినుండి అయినా ఒకటి రెండు రంగాలు ప్రసారం చేయటమున్నూ.

వేంకటరాయశాస్త్రి వంటి అపర మల్లినాథుడు లేక మా పరమగురువులు రాయశాస్త్రి లేక వేంకట రాయశాస్త్రిమూర్తి పర్సనాలిటీ మీద ఒక ప్రసంగం అయినా ఇప్పించాలి, నీరసంగా ఉంది, ఇంకా వ్రాయలేను.

I.c.177.Errum Manzil, మీ
Hyderabad –4 కృష్ణశాస్త్రి

P.S వేంకటరాయశాస్త్రి వంతి మహాపురుషుడు ఎప్పుడెప్పుడో కానీ పుట్టడు. రేపు 21 డిసెంబరు వారి 105వ జన్మదినం. మనవి రెండు మూడు కార్యక్రమంలో ఉండాలి. శ్రీ నాయరుగారితో మాట్లాడండి. నేను చూడవలసినవేకాక వ్రాయవలసినవి ఏవయినా స్క్రిప్ట్స్ ఉంటే తెలియపరచండి. ఏవయినా ఉత్తరాలు వస్తే ఇయ్యండి ఇతని చేతికి.

విజయవాడ

శుక్రవారం

జానకిరాం, ప్రేమతో

మీ ఉత్తరం చేరింది సంతోషము. నేనే వ్రాద్దామనుకున్నాను. ఆ వ్యాసము మీరు చూడలేదేమో మీకు పంపిద్దాము అనుకుంటుండగా మీ ఉత్తరం చేరింది. కొన్ని భాగాలు కొందరిని నవ్వించాయి. అంటే నాకు ఆశ్చర్యంగా ఉన్నది. అటువంటి మాటలు ఏవీ నేను వ్రాయలేదే అని మిమ్మలనూ మీవారినీ గురించి వ్రాసేటప్పుడు, నేను చాలా Restraint చూపవలసి వచ్చింది. మేనరికము అని వ్రాసేటప్పుడే అనుకున్నాను. తర్వాత మళ్ళా, మీరు ఆ మొదటి రోజున ఈస్ట్ నూక్‌లో నా వద్దకు వస్తూ, వారిని పిలిచినప్పుడు ఆ పిలుపులో ఆ మేనరికపు వాత్సల్యము స్ఫురించినది నాకు. ఆ తర్వాత వేసవి అంతా, అప్పుడప్పుడు మీరు అత్తవారింటనే ఉండి ఆనందిస్తున్నది జ్ఞాపకం వచ్చి, మేనరికమే అనుకున్నాను. వారు మీ దెస చూపే ఆప్యాయతా, అలాగే అనిపిస్తుంది నాకు. పోనీలెండి; అచ్చువేసేటప్పుడు మారుస్తాను.

ఇలస్ట్రేటెడ్ వీక్లీకి మీరు కథలు కొన్ని మీరు తెలుగులోంచి ఇంగ్లీషులోకి తెస్తున్నారని విన్నాను. నన్ను వ్రాయమన్నారు. నేను మీ 'నన్నుగురించి కథ వ్రాయవూ ' ఇంగ్లీషు చేస్తున్నాను. మీరు ఈ కథను నాకు వదలండి ఏం?

ఆవిడ కథ నేనింకా చదవలేదు మీరు తిరుపతికి ఉత్తరం వ్రాసినపుడు నేను అక్కడ లేను. మొన్న ఉగాదికి వెళ్ళినపుడు శారద చెప్పింది. చాలా సంతోషించాను. ఈసారి ఆమె వ్రాసినపుడు శేషయ్యగారికి వేరే రిజిష్టర్ కవర్‌లో పంపే వారిని ఆదివారం ప్రభ సారస్వత అనుబంధములలో వెయ్యమని చెప్పండి. ఆ ఆంధ్రప్రభ వారపత్రిక నేనింకా సంపాదింపలేకపోయాను. సంపాదించి చదువుతాను. ఆ విషయం మళ్ళా వ్రాస్తాను.

నేను రచయితల సభకు రావడం లేదు – కానీ ఆ తర్వాత వచ్చి మీ ఇంట్లో 'తిష్ట వెయ్యాలని ఉన్నది, ఒక మూడు వారాలైనా. ఏమో, ఎలా పరిణమిస్తాయో మా ప్లాన్లు.

చి॥కమలా పిల్లలూ ఇరవయ్యో తారీఖున మద్రాసు వెడుతున్నారు. వేసవి అంతా అక్కడే ఉంటారు. శారదా మా అత్తగారూ మే 15కు గానీ మద్రాసు జేరరు. ఈసారి నేను మద్రాస్ వెళ్ళడం లేదు. వారిద్దరూ మద్రాసు వెళ్ళాక నేనూ మా మాధవరమూ, ఆ ప్రాంతాలకు వెళ్ళి రావాలనుకుంటున్నాను. ఆ తర్వాత మీ ఊరు శారద అప్పుడప్పుడు అంటూ ఉంటుంది. తను నేనూ మళ్ళీ ఊటీ వెళ్ళాలని – కొడైకెనాల్‌గాని కాని, ఇది ఇంకా Plous wish గానే ఉంది.

శారద కథలు అచ్చు వేయించాలనే ప్రయత్నము మళ్ళా జరుగుతూంది. బందరు భావరాజు నరసింహారావును కలుసుకుని మాట్లాడాను. వారం పదిరోజులలో ఏ మాటా చెపుతానన్న మనిషి మూడు నెలలైనా గప్ చిప్. ఇదీ వరస. నేనే స్వయంగా అచ్చు వేయిస్తాను. డిస్ట్రిబ్యూషన్ ఏపంత కష్టంకాదు అన్నాను నేను. ఆ ప్రయత్నం ప్రారంభించాను. వేయి కాపీలు 880రూపాయలు. 500 కాపీలు 550 రూపాయలు అన్నారు. వేయి వేయించి కాపీ ఒకటి 2-50 ఉంచినా, ఏడాదిలో చలామణి ఐపోతాయి అన్నారు. కానీ, ఇంతలో శారద అంటూంది. ఈ విషయాలు మనకు తెలియవు – చేతులు కాల్చుకుంటావేమో వద్దు అని. "ఆ డబ్బు పెట్టి ఊటి వెళదామం"టోంది నాకు తాత్కాలిక చల్లదనము కంటె అచ్చైన ఆమె పుస్తకము ఇష్టమని ఎలా ఒప్పించను, ఆమెను!?

స్మృతిపథం, 'భగీరథప్రయత్నం ' చేసి పూర్తిచేయించాను పుస్తకంగా, ఎలాగైతేనేమి ఇపుడు బైండింగ్లో ఆలస్యం – ఇవ్వాళ రేపు: మళ్ళీ రేపు: ఆ తర్వాత మళ్ళీ రేపు. అయినా, ఒడ్డు కనిపిస్తూంది, చేతికి అందుతుంది తీరము నేడో రేపో, కాపీ నేను స్వయంగా మీ చేతిలో ఉంచాలి అనుకుంటున్నాను. అందరూ ఎలా ఉన్నారు? సత్తి, ఆంజనేయులు (?), రామం – వివరంగా వ్రాయండి.

ప్రేమతో,

జానకిరాం

ప్రియమిత్రులు శ్రీ బుచ్చిబాబుగారికి

నమస్కారములు

మీ కార్డ్ అందినది. కృతజ్ఞతలు. షష్టిపూర్తి నిర్వహణ తమకు నచ్చినందుకు ఎంతో సంతోషం. బాగుందని యెందరో రాశారు కానీ మీనుండి లేఖ వచ్చినప్పుడు కలిగిన ఆనందం వేరు. ఏమైనప్పటికీ పిండికొద్దీ రొట్టె. రచనలో శక్తి వుంది గనుక నాటకం రాణించింది. నాకు నచ్చిన కొద్ది స్క్రిప్ట్సులో అదొకటి  బహుశః ఈనెలాఖరులోగా అటురావాలనుకుంటున్నాను. ఎంతవరకు నా కోర్కె నెరవేరుతుందో చెప్పలేను. లీవ్ శాంక్షన్ కాలేదు కాగానే వస్తాను ఓ పదిరోజులు ఉండాలని ఉంది.

పోతే రామకృష్ణని విజయవాడకు ట్రాన్స్‌ఫర్ చేయడం అతను సెలవుపెట్టి హైదరాబాదు కోసం ట్రై చేస్తుండటం మీరు ఎరుగుదురనుకుంటాను వీలైతే ఇక్కడ ఉండడానికి ప్రయత్నమనుకోండి.

రమణమ్మగారిని మద్రాసు వేశారు ఇది నిన్నటి వార్త. మీ ఆరోగ్యం గురించి వ్రాయించండి. శ్రీమతి సుబ్బలక్ష్మిగారికి నా నమస్కారాలు అందించండి.

అక్కడి విశేషాలు వ్రాయించండి. తమకు నేను పుస్తకాల బాపతు కొద్ది మొత్తం ఇవ్వవలసి యున్నది. మరేమైన నాటికలు పంపండి. వచ్చే క్వార్టర్‌లో వేసుకుంటాం. ఇతరులవి కూడా సజెస్ట్ చేయండి. ఇంగ్లీషు నాటకాలు ఏవైనా ఎడాప్ట్ చేసుకోడానికి అనువైనవి (కాపీరైట్స్ గొడవ అడ్డుతగలనివి) సజెస్ట్ చేయండి. మంచి నాటకం స్క్రిప్ట్ దొరకాలేగాని నిర్వహణ ఎలా వున్నా బాగానే ఉంటుంది. మంచి నాటకం బాగా లేనప్పుడు ఏం చేసినా బాగనిపించదు.

"ఉత్తమా ఇల్లాలు" మళ్ళీ ఇక్కడ నుంచి వేస్తున్నాం. రికార్డింగ్ భద్రపరిచాను.

మద్రాసు నాటకాలు దయతో విని ఎట్టి మొహమాటం లేకుండా నాకు మీ విమర్శలిస్తూ ఉండండి. మార్గదర్శకత్వం నాకు ఎంతైనా అవసరం. నాటకాలు ఎన్నుకోవటం దగ్గర నుంచి నిర్వహణదాకా మీ సూచనలు కావాలి. నాకు మీ సలహాలు శిరోధార్యములు మీ అనుభవంలో ఎన్నో వంతు నాది?

సర్వదా

మీ దాశరధి

పి.ఎస్. దాశరధీ శతకం రేపు పంపుతాను.

A.I.R
Hyderabad
1-1-61

నా ప్రియమైన బుచ్చిబాబునకు ఆశీర్వచనాలు.

29వ తేదీగల నీజాబందింది. నీ అభిమానం నాకు ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో జ్ఞాపకానికి వస్తూండడం సహజమైనా, అది ఆనందాన్ని అందించేదిగా కూడా కావటం నా అదృష్టం. నా నిత్యమననం, మరల నిన్ను జాబులో కనిపింపజెయ్యడం. ఏమని వ్రాయాల్నో ఈ ఆనంద మైకంలో నాకు సరియైన మాటలందడంలేదు.

నా హృదయస్థులను మర్యాద పదాలతో సంబోధించడం నాకలవాటుపడని ఒక అంతఃస్సు. అలాంటి అంతఃస్సును మరింతగా శుభ్రపరచుకుని, నిన్నూ, మా అమ్మాయినీ, ఈ నూతన సంవత్సరారంభంలో ఆనంద శుభమంగళ ప్రదంగా ఆశీర్వదిస్తున్నాను.

నాకివ్వడానికి నిశ్చయింపబడిన కేంద్ర అకాడమీ బహుమతికి నీవంటి కళాభిమాని పంపిన అభినందనాలు ఒక పరువును గూర్చినట్లుగా ప్రమోదమొందుతున్నాను. నేను వ్రాయనెంచిన నా జీవిత చరిత్ర "నటస్థానం"లో నీ జాబును ముద్రించుకుంటాను.

